


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**65**

(10 సెప్టెంబరు 71, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**"కళలకు చేసే మహోపకారం** ఏమిటయ్యా" అని ప్రశ్నిస్తే వాటి జోలికిపోకుండా వుండటమేనని జవాబు చెప్పారట. అంత పవిత్రమైనవి కళలు.

పరిపూర్ణత, ప్రతిభ - కళల విషయంలో సాధించవలసిన విజయాలు. అవి వ్యక్తికేకాదు, కథాలోకానికే విజయాలు. అందువల్ల వాటిని జాగ్రత్తగా కాపాడటం నేర్చినవారు నిజమైన కళా పోషకుల క్రింద జమ కట్టబడతారు.

దేశంలో కోట్లాదిమంది ప్రజలుండగా కొద్దిమందే కళాకారులుగా భాసించడమేమిటి? కొద్దిమందే గాయకులుగా నిలబడకలగడం దేనివల్ల? పరిపూర్ణతా, ప్రతిభా ఆ కొద్దిమందికే లభ్యమైంది గనుక - భగవంతుడు వారినిలా దీవించి పంపాడు గనుక.

***ఒక్క ఘంటసాల, ఒక్క బాలమురళీ***

అందుకని గాయకుల్ని ఏదేశం ఒక్కసారిగా చూడలేదు. మన సినిమా ప్రపంచంలో చెప్పుకోదగ్గ గాయకులు వేలాది పాటలు పాడినా విసుగు పుట్టని గాయకుడు - ఒక్క ఘంటసాలే వుండటమేమిటి మరి!. ఆంధ్రదేశంలో ఒక్క బాలమురళియే వుండటమేమిటి? ఆ పేరుగలవాళ్ళంతా పాటకచ్చేరీలు చేయవచ్చుగా!

స్త్రీలలో ఒక్క భానుమతి, ఒక్క సుశీల, ఒక్క గోపాలరత్నం లభించడమేమిటి? ప్రతివారికీ "రాల్ కరిగించు విమల గాంధర్వం" లభించదేం. సాంప్రదాయ గాయకులలో లలిత సంగీతంలో ఆరితేరిన వాళ్ళు ఏకొద్దిమందో వున్నారు. అందరినీ కలిపి ఆలోచించినా కోటికో నలుగురు అయిదుగురు గానసుధను అందించగలవారుంటారు. వారినే మనం పూజిస్తున్నాం. గౌరవిస్తున్నాం. సంగీతం కోసం వారి మీద ఆధారపడే వుంటున్నాం.

***ఒక్క లత, ఒక్క ముఖేష్, ఒక్క రఫీ, ఒక్క తలత్***

హిందీ ఫిలిం రంగంలో ఎందరో గాయకులు, గాయనీమణులు వున్నారు. కానీ ఒక్క లత, ఒక రఫీ, ఒక్క ముకేష్, ఒక్క తలత్ - మనల్ని ముగ్ధుల్ని చేయగలుగుతున్నారు. వారి సంగీతం కోసం మనం ఎంతో ఆశతో ఎదురు చూస్తూ వుంటాం.

దేశంలో సాంస్కృతిక సంపదలు సజీవంగా వుండాలంటే కళలన్నీ పరిపూర్ణమైన స్థితిలో పోషించబడాలి. తక్కినవారి గానాలు లెక్కలోకిరావు. "నీ సంగీతానికి నా సహనమే సరిపోయింది. తల అంతగా తిప్పినందుకు నీ తంబురా ఇలా పెట్టిపోవయ్యా గాయకోత్తమా" అన్నట్లు వుండవచ్చు.

"మీవారు పడుకోబోయే వేళ ప్రతిరాత్రీ అలా సంగీతం పాడతారు. మీకేమైనా హాయిగా వుంటుందా?" అని ఒక ఇల్లాలు ప్రక్క యింటి ఇల్లాల్ని అడిగిందట.

"నాకు మాత్రం హాయిగా వుంటుంది. తక్కినవాళ్ళ సంగతి నాకెందుకు? ఆయనగారు ఒకవేళ బద్దకించినా నేను అరుగుమీద కూర్చుని కాస్సేపు రాగాలాపన చెయ్యండని బ్రతిమాలుతాను" అన్నదట. ఆ ఇల్లాలు.

"అలాగా! మీరు కోరికూడా పాడిస్తూ వుంటారా? అందులో రహస్యమేమిటో చెప్పండి. మేము కూడా తెలుసుకుంటాం. ఆయన పాట ఆపేదాకా మా ఇంట్లో పసిపిల్ల బాలాది ఎలాగూ నిద్ర మేల్కొంటున్నాం. కాలం వృధాగా పోతోందనుకుంటున్నాం. ఆ రహస్యం మాక్కూడా చెప్పండి. ఆ హాయి మేము కూడా అనుభవిస్తాం" అని ప్రక్క యింటి ఇల్లాలు అడిగిందట ఎంతో ఆత్రంగా.

***అలవాటయిన కంఠం కప్పలకంటే నయంకాదూ!***

"రహస్యం ఏమీలేదమ్మా.. అందరికీ తెలిసిన విషయమే. మన ఇళ్ళ వెనుకవున్న నీళ్ళగుంటలో కప్పలు బెకబెకలాడుతూవుంటాయి ఎప్పుడూ? రాత్రిళ్ళు ఆ శబ్దం మరీ ఎక్కువ. తక్కినప్పుడు భరించినా నిద్రవచ్చేటప్పుడు ఆ మోతను తలబ్రద్దలయినట్లుంటుంది. కునుకు పట్టదు. వానాకాలంలో ఈ బెడదా తప్పదు. అందుకని మావారిని కొంచెం సేపు పాడమని అడుగుతా. ఎరుగున్న గొంతు కనుక ఎలాగో అలా భరించకలుగుతున్నా. కప్పల బెకబెకలు వినిపించవు కనుక కాస్త కన్నుమూసి నిద్రపోతున్నా" అని చెప్పిందట.

మేమెరుగున్న ఒకరి ఇంట్లో రాత్రిపూట ఆ ఇల్లాలు జోలపాట ప్రారంభించేది. ఆ పిల్ల నిద్రపోవడం కోసం ఆవిడ చేసే ప్రయత్నంలో చుట్టుపట్ల నాలుగు ఇళ్ళలో వాళ్ళు మేలుకునేవారు. భర్త ఎంతో గిజగిజలాడిపోయేవాడు. "కొంచెం ఆపవే పుణ్యం వుంటుంది" అని బ్రతిమాలేవాడు.

"అదేమిటండీ పిల్లకు నిద్ర వస్తోంది. మధ్యలో ఆపమంటారేమిటి. చూడండి అయిదు నిముషాల్లో నిద్రపోతుంది" అనేది.

***నీ పాటకు నిద్రపోవడంలా... భయపడి..!***

"పిల్ల నీ పాటకు నిద్రపోతుందనడం కలలో వార్త. ఆ అరుపులకు అదిరి, బెదిరి, హడలిపోయి భయంతో నిద్రపోతుంది" అనేవాడాయన.

మేము మద్రాసులో వుండగా ఒక ఆంధ్ర మహిళ అక్కడగల సంగీత వాతావరణం చూచి తనుకూడా సంగీతం నేర్చుకోవాలని ఎంతో ముచ్చటపడింది. భర్తను వరమడిగింది. "నేను యింట్లో లేనప్పుడు నేర్చుకో పాఠాలు - అలా అయితే నాకేం అభ్యంతరం లేదు" అన్నాడు. ఆవిడ అక్కడికే సంతోషించింది. ప్రయివేటు మాష్టర్ని కుదుర్చుకుంది.

మంచి ప్రౌఢవయస్సు. నలుగురు పిల్లలు. ఒక్కడు బడికి వెళ్ళేవాడు. తక్కిన ముగ్గురు పిల్లికూనలల్లే ఇంట్లోనే తిరుగుతూ వుండేవాళ్ళు. మధ్యాహం ఒంటిగంటకు ప్రయివేటు.

గొంతు మంచిది. అభిలాష తక్కువలేదు. అందువల్ల త్వరలోనే కీర్తనల్లోకి వచ్చింది.

కానీ ఆవిడ అవస్థ ఇలా వుండేది.

"రామా సుజన జీవనా.. ఆ...ఆ..."

కుర్రాడు: "అమ్మా కాలికి దెబ్బ తగిలిందే! "

"ఎందుకు ఏడుస్తావు. గూట్లో టించర్ ఐడిన్ వుంది రాసుకో.

సుజన జీవనా - సుగుణ భూషణా అజనందిత శ్రిత చందన దశతురంగ.

***దశ తురంగమా..పరుప్పుకింద బిస్కెట్లున్నాయి.***

పిల్ల: "అమ్మా ఆకలవుతోందే కడుపులో మండిపోతోంది. "

"మండిపోతే పరుప్పుకింద బిస్కట్ పొట్లం వుంది. రెండు తిని మంచినీళ్ళు త్రాగు. మంచి పుష్టినిస్తాయి. రుచిగా వుంటాయి. ఇక నాకు అడ్డు రాకు.

చారునేత్రా శ్రీకళత్రా శ్రీ రమ్యగాత్రా..

పిల్లాడు: "అమ్మోయి చిట్టి చెల్లాయి లేచిందే "

"లేస్తే అక్కడ పాలసీసా వుంది త్రాగించు.

అదే వూరుకుంటుంది. నన్ను పాడుకోనీ."

ప్రయివేటు మాష్టారు "అమ్మా పాడబోయేది శాంతము లేక.."

ఇల్లాలు "అలాగే మాష్టారూ!"

సంగీతంలో ఎన్ని అవాంతరాలో చూడండి. అయినా అభిలాష అలాగే వుంటుంది. కమ్మటి పాటలో మధ్య మధ్య గందరగోళాలుంటే ఫలితమేం దక్కుతుంది.

రేడియోలో మొదట్లో పేర్కొన్న మహాగాయకుల గానాన్ని ఆస్వాదిస్తూ మధ్య మధ్య వర్తక ప్రకటనలు వింటుంటే కళాపోషణకు దోహదం చేసే ప్రభుత్వం...!

Post your comments